www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 3 నవంబర్ 2024

వైవీయూ ఎంబిఎ పరీక్ష ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వ విద్యాలయం ఎంబిఎ, ఎంబిఎ హెచ్ఆర్ఎం నాల్గవ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను విసి ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ కృష్ణారావు, ఎంబిఎ విభాగ డీన్ ప్రొఫెసర్ వై.సుబ్బరాయుడుతో కలిసి శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఫలితాల విడుదల సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంబిఎ, ఎంబిఎ హెచ్ఆర్ఎంలో వందశాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.

పరీక్ష ఫలితాలు విడుదల చేస్తున్న విసి కృష్ణారెడ్డి

మొక్కుబడిగానే..!

- స్టాండింగ్ కమిటీ సమావేశంలో కరువుపై నిలదీత
- షాదీఖానా ఖర్చుల దుర్వినియోగంపై ఆగ్రహం

సమావేశంలో మాట్లాడుతున్న జడ్‌పి సిఇఒ ఓబులమ్మ

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జడ్‌పి స్టాండింగ్ కమిటీ సమావేశం మొక్కుబడిగా ముగిసింది. శనివారం జిల్లా పరిషత్ ఛైర్మన్ జేష్టాది శారద అధ్యక్షతన జడ్‌పి స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. సంబంధిత కమిటీ ఆయా శాఖల అధికారులతో ప్రోగ్రెస్‌ను సమీక్షించాలి. స్టాండింగ్ కమిటీ సభ్యులు పూర్తి స్థాయిలో కసరత్తు చేసి లోపాలపై ప్రశ్నించాలి. సంబంధిత అధికారుల నుంచి సమాధానాలు రాబట్టుకుని, లోపాలను సరిదిద్దుకుని ముందుకు సాగాలి. సమీక్ష అనంతరం ఆయా శాఖల అధికారులు విధుల నిర్వహణకు వెళ్లి పోవడం పరిపాటి. జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశంలో శాఖల సమీక్ష పూర్తి చేసుకున్న కొందరు అధికారులు తీరికగా ఆశీనులు కావడం ఆశ్చర్యపరిచింది. కడప జిల్లాను కరువు మండలాల జాబితాలో లేకపోవడానికి జిల్లా వ్యవసాయశాఖ సమాధానం చెప్పాలని జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు ఖలీముల్లా డిమాండ్ చేశారు. జిల్లాలో కరువు పరిస్థితులు దారుణంగా ఉన్నాయని, సుమారు 10 మండలాలకుపైగా లోటు వర్ష పాతం నెలకొందని, ఫలితంగా పంటల సాగు లక్ష్యానికి చేరని పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లాలోని షాదీఖానాలు రాజకీయ పునరావాస కేంద్రాలుగా మారాయని విమర్శించారు. షాదీఖానా నిర్వహణ ఖర్చుల వినియోగంలో కొందరు చేతివాటం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. షాదీఖానా నిర్వహణ ఖర్చుల దుర్వినియోగానికి పాల్పడిన వారికి నోటీసులు జారీ చేసి రికవరీ చేయాలని నిలదీశారు. దీనికి వక్ఫ్‌బోర్డ్ అధికారులు స్పందించి జిల్లాలో 12 షాదీఖానాలు ఉన్నాయని, నిర్వహణ ఖర్చుల వినియోగంలో చేతివాటం ప్రదర్శించిన వారికి నోటీసులు జారీ చేసి, రికవరీ చేస్తామన్నారు. అనంతరం పోరుమామిళ్ల జడ్‌పిటిసి అసంపూర్తిగా నిలిచిన అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు జడ్‌పి నిధులతో పూర్తి చేస్తామని చెబితే బిల్లులు చేయలేమని చెబుతున్నారని నిలదీశారు. కార్యక్రమంలో జడ్‌పి వైస్ ఛైర్మన్ బాలయ్య, ఓబులమ్మ, డిప్యూటీ సిఇఒ మైథిలి, పలువురు జడ్‌పిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లకు మరమ్మతులు

- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - సంబేపల్లి (రాయచోటి)

ప్రతి గ్రామంలోనూ గుంతలు పడిన రోడ్లకు మరమ్మతులు చేపట్టి వాటి రూపురేఖలు మారుస్తామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ పేర్కొన్నారు. శనివారం సంబేపల్లిలో కలెక్టర్ శ్రీధర్ చామకూరితో కలిసి ఆయన రోడ్ల మరమ్మతు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా 'గుంతలు లేని రోడ్లు' కార్యక్రమాన్ని ప్రారంభించిందని చెప్పారు. గతంలో రోడ్లు గుంతలు పడి ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొనేవారని, ఇక నుంచి పాదచారులు, వాహనదారులు రోడ్లపై సాఫీగా వెళ్లేందుకు మరమ్మతులు చేపడుతున్నామని చెప్పారు. ఇందుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. గతంలో ఇల్లు నిర్మించుకోవాలంటే ఇసుక సమస్యతో ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొనే వారని అలాంటి సమస్యను ప్రభుత్వం పూర్తిగా పరిష్కరించిందని చెప్పారు. గతంలో ఇసుకతో వ్యాపారం చేసేవారని, ప్రస్తుతం అడిగిన ప్రతి ఒక్కరికీ ఉచితంగా అవసరాలకు మాత్రమే ఇస్తున్నామని పేర్కొన్నారు. ట్రాక్టర్ల ద్వారా ఇసుక రవాణా చేసుకునేందుకు ప్రభుత్వం పూర్తి స్వేచ్ఛనిచ్చిందని తెలిపారు. అధికారులు కానీ, పోలీసులు కానీ ఎవరు కూడా ట్రాక్టర్ల, ఇసుక బండ్లను ఆపకూడదన్నారు. నియోజకవర్గంలో చాలామంది పెన్షన్లకు అర్హులు ఉన్నారని, వారందరికీ మంజూరు చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపిందని తెలిపారు. త్వరలో అర్హులైన ప్రతి ఒక్కరికి కొత్త పింఛన్లు మంజూరు చేస్తామన్నారు. రాయచోటి నియోజకవర్గంలోని పలు గ్రామాలలో ప్రజలు శ్మశాన వాటికలు లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రతి గ్రామంలో శ్మశాన వాటిక నిర్మించేందుకు సంబంధిత తహశీల్దార్‌తో స్థలాన్ని గుర్తించాలని మంత్రి, కలెక్టర్‌కు సూచించారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజలు సుఖ సంతోషాలతో ఉన్నారని, ఇలాంటి ప్రభుత్వం పది కాలాల పాటు ఉండేందుకు ప్రజలు సహకరించాలన్నారు. అనంతరం కలెక్టర్ శ్రీధర్ చామకూరి మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా గుంతలు లేని రోడ్లు కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామంలో మరమ్మతులకు గురైన రోడ్లను సరిచేసి వాహనదారులు, పాదచారులు ప్రశాంతంగా రోడ్ల పైన వెళ్లే విధంగా రోడ్లకు మరమ్మతులు చేపడుతారన్నారు. కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం : నియోజకవర్గంలో శాశ్వత భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పేర్కొన్నారు. సంబేపల్లి మండలం, మల్లూరు వాండ్లపల్లెలో భూ సమస్యల పరిష్కారానికి గ్రామ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గంలోని రాయచోటి, సంబేపల్లి, గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, రామాపురం, చిన్నమండెం మండలాలలో శాశ్వత భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇందుకోసం గ్రామాలలో గ్రామసభలు నిర్వహించి రెవెన్యూ అధికారుల ద్వారా సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. ప్రజలు తమకు సమస్యలను అర్జీల రూపంలో అధికారులు తెలియజేసి అక్కడికక్కడే పరిష్కరించుకోవచ్చు అన్నారు. రెవెన్యూ అధికారులు గ్రామసభలలో వచ్చిన సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. రాబోయే రోజులలో నియోజకవర్గంలోని ప్రజలు ఎటువంటి భూ సమస్యలతో బాధపడకూడదన్నారు.

అంతర్రాష్ట్ర గంజాయి ముఠా అరెస్టు

- సుమో, కారు, 50 కిలోల గంజాయి స్వాధీనం
- ఎస్‌పి వి.విద్యాసాగర్ నాయుడు వెల్లడి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్/రైల్వేకోడూరు

అంతర్రాష్ట్ర గంజాయి ముఠాను అరెస్టు చేసినట్లు ఎస్‌పి వి.విద్యాసాగర్ నాయుడు తెలిపారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గంజాయి ముఠా నుంచి 50 కిలోల గంజాయి, సుమో, కారు స్వాధీనం చేసుకున్నామన్నారు. రాజంపేట డిఎస్‌పి ఎన్.సుధాకర్ అధ్వర్యంలో రైల్వేకోడూరు రూరల్, అర్బన్, రాజంపేట రూరల్ సిఐలు పి.వెంకటేశ్వర్లు, హేమసుందర్‌రావు, బి.వి.రమణ, ఓబులవారిపల్లి తహశీల్దార్ బి.శ్రీధర్‌రావు, పోలీసు సిబ్బందితో కలిసి గంజాయి రవాణా గురించి రాబడిన సమాచారంపై ఓబులవారిపల్లి, మంగంపేట, చెన్నకేశవగుడి సమీపంలో ఎన్‌హెచ్-716 రోడ్‌లో వాహనాలు తనిఖీ చేశారని పేర్కొన్నారు. మంగళంపల్లి నుంచి నలుగురు వ్యక్తులు సుమో, కారులో తిరుపతికి తరలిస్తున్న రూ.10 లక్షలు విలువైన 50 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వారిని అరెస్టు చేశామన్నారు. అరెస్టయిన వారిలో పుల్లంపేటకు చెందిన కల్లపల్లి నాగేంద్ర, తిరుపతికి చెందిన కె.కుమారి, కేరళ రాష్ట్రానికి చెందిన బాపురాజన్, చిత్తూరు జిల్లా పలమనేరుకు చెందిన షేక్ సలీంబాషా ఉన్నారన్నారు. వారిపై ఓబులవారిపల్లె పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశామన్నారు. గంజాయి అమ్మినా, కొన్నా, దాచి ఉంచినా, అక్రమ రవాణా చేసినా అందుకు ఏవిధంగా సహకరించినా అట్టివారిపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. పదే పదే ఇలాంటి నేరాలకు పాల్పడిన వారిపై పీడీ యాక్ట్ అమలు చేస్తామని హెచ్చరించారు. ప్రజలెవరైనా మీ దృష్టికి ఇలాంటి అక్రమ కార్యకలాపాల గురించి సమాచారం వస్తే మాకు తెలియజేయాలని, మీ వివరాలు గోప్యంగా ఉంచి నేరస్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఈ కేసులో మంచి ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులను, సిబ్బందిని ఎస్‌పి అభినందించారు. పైవ్యక్తులను పట్టుకోవడంలో ఓబులవారిపల్లి ఎస్ఐ మహేష్ నాయుడు కింద పడి చేతికి గాయాలైయ్యాయని, అయినా వెరవకుండా ముద్దాయిలను అరెస్టు చేసిన ఎస్ఐని ప్రత్యేకంగా ఎస్‌పి అభినందించారు.

పేదలకు కార్పొరేట్ వైద్యం : 'నల్లారి'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషోర్ కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-పీలేరు : గ్రామీణ ప్రాంతాల్లోనూ కార్పొరేట్ స్థాయి వైద్య శిబిరాలు నిర్వహించి రోగులకు వైద్య సేవలు అందించడం హర్షణీయమని ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి తెలిపారు. తెలుగుదేశం పార్టీ ప్రముఖ నాయకులు పల్లవోలు హేమచంద్రారెడ్డి ఆధ్వర్యంలో శనివారం మండలంలోని ముడుపులవేముల సమీపంలోని బోయకొండ గంగమ్మ గుడి దగ్గర తిరుపతి శ్రీరమాదేవి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్య బృందం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కిషోర్ కుమార్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్పొరేట్ తరహా వైద్యం క్షేత్రస్థాయిలోనూ ప్రజలకు అందించడం హర్షణీయమన్నారు. రమాదేవి ఆసుపత్రి వైద్య బృందం మాట్లాడుతూ ఈ వైద్య శిబిరానికి 100 మందికి పైగా రోగులు వచ్చారని, వారికి అన్ని రకాల వైద్య సేవలు అందించి, మందులు పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో కూటమి పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, నల్లారి అభిమానులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శాంతారాంతో నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు

టిటిడి బోర్డు సభ్యుడిని కలిసిన నాయీబ్రాహ్మణులు

ప్రజాశక్తి-మదనపల్లి

టిటిడి పాలకమండలి సభ్యులు వైద్యం శాంతారామ్‌ను కుప్పంలో శనివారం ఉమ్మడి చిత్తూరు జిల్లా నాయీబ్రాహ్మణ సాధికారిక సమితి సభ్యులు కలసి టిడిపిలో నాయీ బ్రాహ్మణులకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, కూటమి ప్రభుత్వానికి రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సాధికార సమితి సభ్యులు మంగళ ప్రభాకర్, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు చింతకుంట కేశవులు, చిత్తూరు జిల్లా అధ్యక్షులు భజంత్రి సుబ్రహ్మణ్యం హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా పాలకమండలి సభ్యులుగా నియమిస్తానని మాట ఇచ్చిన చంద్రబాబు నాయుడు టిటిడి పాలక మండలి సభ్యులుగా వైద్యం శాంతారావుని నియమించినందుకు రాష్ట్ర నాయి బ్రాహ్మణ సోదరులందరూ హర్షం వ్యక్తం చేస్తూ మేమందరం తెలుగుదేశం పార్టీ వెంట ఉంటామని పేర్కొన్నారు. చంద్రబాబునాయుడు కోసం అహర్నిశల కృషి చేస్తామని తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సాధికార సమితి సభ్యులు, మనోహర్, పాండు, రామకృష్ణ, సూర్యనారాయణ, కొక్కంటి సుబ్రహ్మణ్యం, పంజాని చెన్నకేశవ, పవన్ కుమార్ పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే డిఎస్‌సిలో విజయం సొంతం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రణాళికా బద్ధంగా చదివితే డిఎస్‌సిలో విజయం సాధించవచ్చునని చిత్తూరు కుట్టి స్టడీ సెంటర్ నిర్వాహకులు రామకృష్ణ తెలిపారు. శనివారం కుట్టి స్టడీ సెంటర్ వారిచే గొల్లపల్లి సర్కిల్‌లోని ప్రధాన గ్రంథాలయ శాఖలో గ్రంథాలయ అధికారిణి ఆర్.వసంత కుమారి అధ్యక్షతన డిఎస్‌సి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కుట్టి స్టడీ సెంటర్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. డిఎస్‌సి శిక్షణలో అగ్రగామిగా ఉన్న కుట్టి స్టడీ సెంటరులో ఎంతో మంది శిక్షణ పొంది ఉపాధ్యాయులుగా తమ కలలను సాకారం చేసుకున్నారన్నారు. అనంతరం జి.ఎస్.రావు సైకాలజీ గురించి, పరీక్షకు ఎలా సన్నద్ధం కావాలని అంశాలను వివరించారు. ప్రతి సబ్జెక్టును క్షుణ్ణంగా చదవడం ద్వారా డిఎస్‌సిలో ఉత్తీర్ణత సాధించి సులభంగా ఉద్యోగం పొందవచ్చున్నారు. ఈ సదస్సుకు హాజరైన విద్యార్థులకు గ్రంథాలయ అధికారిణి ఆర్.వసంత కుమారి చేతులు మీదుగా డిఎస్‌సి మెటీరియల్‌ను ఉచితంగా అందించారు.

విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ చేస్తున్న వసంతకుమారి

అపార్ సమస్య పరిష్కరించాలి

ప్రజాశక్తి -కడప అర్బన్

విద్యార్థులకు అపార్ ఐడి నెంబర్ ఉత్పత్తి చేసేటప్పుడు ఎదురవుతున్న సమస్యలు పరిష్కరించాలని ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల శివార్జున కోరారు. జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన డిఇఒను సంఘ నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మేకల శివార్జున మాట్లాడుతూ డిఇఒ జిల్లాకు రావడం తమకు సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయులమీద ఒత్తిడి లేకుండా చేయాలని కోరారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు ఉద్యోగాలు కల్పించేటప్పుడు ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతుల్లో రిజర్వేషన్లు పారదర్శకంగా అమలు పరచాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పి.శేషగిరిరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. గంగరాజు, కార్యదర్శులు సి.సురేంద్ర, కె. జయరాం పాల్గొన్నారు.

మదనపల్లె ఎంపిడిఒగా తాజ్ మస్రూర్

మాట్లాడుతున్న తాజ్ మస్రూర్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె ఎంపిడిఒగా తాజ్ మస్రూర్ శనివారం బాధ్యతలు చేపట్టారు. చిత్తూరు జిల్లా, గుడుపల్లె మండలంలో పనిచేస్తున్న తాజ్ మస్రూర్ బదిలీపై మదనపల్లెకు వచ్చారు. గతంలో ఎఒగా ఉన్న మస్తాన్ వలి ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా తాజ్ మస్రూర్ మాట్లాడుతూ మదనపల్లె మండలం అభివృద్ధికి స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమన్వయం చేసుకొని సమస్యల పరిష్కారం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఆదేశాల మేరకు మండలం, గ్రామాల అభివృద్ధికి, సమస్యల పరిష్కారం కోసం సేవలు అందిస్తానని స్పష్టం చేశారు.

అవినీతి రహిత సమాజం కోసం కృషి చేద్దాం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : అవినీతి రహిత సమాజం కోసం కృషి చేద్దామని గ్రామజ్యోతి అధ్యక్షులు సుభద్ర పిలుపునిచ్చారు. శనివారం కేంద్ర ప్రభుత్వ యువజన సర్వీసుల క్రీడల మంత్రిత్వ శాఖ అనుబంధ సంస్థ, నెహ్రూ యువ కేంద్రం వారి సౌజన్యంతో గ్రామజ్యోతి సొసైటీ ఆధ్వర్యంలో భారతి జూనియర్ కళాశాలలో విజిలెన్స్ అవేర్నెస్ వీక్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవినీతి కార్యకలాపాలను చురుకుగా వ్యతిరేకించాలని, ప్రజా జీవితంలో,ప్రభుత్వ సంస్థల్లో నైతిక సూత్రాలు, నిజాయితీని ప్రోత్సహించాలన్నారు. విజిలెన్స్ సంస్థలు అవినీతులపై ఎలా పోరాడి ప్రజా ప్రయోజనాలను ఎలా పరిరక్షిస్తాయో తెలియజేస్తున్నామన్నారు. భారతదేశం సామాజిక ఆర్థిక అభివృద్ధి లక్ష్యాలను చేరుకోవాలంటే అవినీతి, నిరోధక సంస్థలను మెరుగు పరచుకోవాలన్నారు. విజిలెన్స్ అవేర్నెస్ వీక్ ద్వారా జాతిస్థాయిలో అవినీతికి వ్యతిరేకంగా పోరాటాన్ని కొనసాగించడం ఎంత కీలకమో విద్యా సంస్థల్లో చైతన్యం తీసుకొస్తున్నామని తెలిపారు. అవినీతి ఆరోపణలను ఎదుర్కొంటున్న 108 దేశాలలో భారతదేశం 93 దేశంగా ఉందని గుర్తు చేశారు. అవినీతి లేని భారతదేశ నిర్మాణమే లక్ష్యంగా యువత ముందడుగు వేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి, గ్రామజ్యోతి పియర్ సంస్థ సిఎస్ పసల మహేష్, శశి, గౌస్ బాషా, హెచ్ఒడిలు, విద్యార్థులు, ఎన్ఐకె కో-ఆర్డినేటర్ మణికంఠ పాల్గొన్నారు.

5న పిడిఎస్‌యు 50 ఏళ్ల ఉత్సవాలు

ప్రజాశక్తి-రాయచోటి : ఈనెల 5న విజయవాడలో పిడిఎస్‌యు 50 ఏళ్ల ఉత్సవాలు నిర్వహించనున్నట్లు విద్యార్థులు, యువత అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.అంకన్న పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలో మాసాపేటలో వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరిగ్గా 50 ఏళ్ల కిందట హైదరాబాదులోని ఉస్మానియా యూనివర్సిటీలో జార్జిరెడ్డి నేతృత్వంలో పురుడు పోసుకున్న పిడిఎస్‌యు నాటి నుంచి ఇప్పటి వరకు అనేక విద్యార్థి యువత ప్రజా సమస్యలపై అలుపెరిగిన పోరాటాలు చేసిందన్నారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా నాయకులు మహబూబ్ బాషా, రెడ్డి ప్రసాద్, గణేష్,శివ సాయి, సాజిద్, రవీంద్ర, భాస్కర్, సుబ్రమణ్యం, సుబ్బరాయుడు, అంజి, శివకేశవ, మహేష్ పాల్గొన్నారు.

నేడు డిఆర్‌సి సమావేశం

ప్రజాశక్తి-రాయచోటి : జిల్లా అభివృద్ధి సమీక్ష సవేమాశం ఆదివారం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బిసి.జనార్ధన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్రీధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ సమావేశ హాలులో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో ఇన్‌ఛార్జి మంత్రితో పాటు రవాణా, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, జిల్లాలోని ఎంపీ, ఎమ్మెల్సీలు, ఎమ్మె ల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొంటారన్నారు. జిల్లాలో అమలు అవుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలపై సమగ్ర నివేదికలు రూపొం దించాలని జిల్లా అధికారులందరికీ ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామని పేర్కొన్నారు.

ఉమ్మడి జిల్లాలో డ్రాయింగ్ పోటీలు

ప్రజాశక్తి -కడప అర్బన్ : ఉమ్మడి జిల్లాలో డ్రాయింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు యుటిఎఫ్ నాయకులు పేర్కొన్నారు. శనిఆవరం స్థానిక యుటిఎఫ్ భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 10న ప్రొద్దుటూరు, 17న బద్వేలు, రాజంపేట, పులివెందుల, 24న రాయచోటి చిత్రకళా పోటీలుంటాయన్నారు. పోటీల్లో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు పాల్గొనవచ్చున్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, కరస్పాండెంట్లు, విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫోరమ్ ఫర్ ఆర్టిస్ట్స్ అధ్యక్షులు సునీల్ కుమార్, కార్యదర్శి మల్లి, కోశాధికారి రమేష్ జాషువా సాంస్కృతిక వేదిక కార్యదర్శి గుండు నారాయణ, కడప బాలోత్సవం అధ్యక్షుడు జి. గోపాల్, జెవివి శివరాం సమావేశంలో పాల్గొన్నారు.

కత్తిరింపు

ప్రజాదృష్టి

జిల్లాల్లో కరువు..కత్తిరింపులకు గురైంది. కడప, అన్నమయ్య జిల్లాలోని 66 మండలాల పరిధిలో కరువు కరాళ నృత్యం చేస్తోంది. 19 మండలాలను కరువు ప్రాంతాలుగా గుర్తించింది. మిగిలిన 47 మండలాలను గాలికి వదిలేసింది. ఖరీఫ్ సీజన్ మొదలు నుంచి వర్షపాతలేమి వేదింపులకు గురిచేస్తోంది. కరువు పరిస్థితులను అంచనా వేయడానికి సంబంధించిన ఐదారు పారా మీటర్ల ఆధారంగా కరువును గుర్తించడం పరిపాటి. 2024-25 ఖరీఫ్ సీజన్ ముగిసిన నేపథ్యంలో ప్రభుత్వం కరువు మండలాలను నోటిఫై చేసింది. కడప జిల్లాలోని 36 మండలాలు, అన్నమయ్య జిల్లాలో 30 మండలాలు వెరసి 66 మండలాల్లో 33 మండలాల్లో కరువు ఛాయలు స్పష్టంగా కనిపించడం గమనార్హం. ఇందులో కడప జిల్లాలో 10 మండలాల్లో వర్షపాత లేమి కనిపించింది. అన్నమయ్య జిల్లాలో 23 మండలాల్లో వర్షపాత లేమి కారణంగా పంటలు సాగు ప్రశ్నార్థకంగా మారింది. వర్షపాత లేమి, పంటల సాగు తగ్గుదల, ఎండుతున్న పంటలు, తాగునీటి సరఫరా, ఉపాధి హామీ పనుల పెరుగుదల, పశువులు కబేళాలకు తరలింపు, పశుదాణా తదితర పారామీటర్లను దృష్టిలో ఉంచుకుని కరువు మండలాలను గుర్తించినట్లు తెలుస్తోంది. కడప జిల్లాలో వర్షపాత లేమి, పంటల సాగు విస్తీర్ణం తగ్గుదల వంటి పలు పారామీటర్ల ఆధారంగా కడప జిల్లాలోని 36 మండలాల్లో సుమారు 10 మండలాల్లో లోటు వర్షపాతం కొనసాగుతోంది. ఇటువంటి క్షామ పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో కడప జిల్లాలో కరువు మండలాలను గుర్తించాల్సి ఉంది. ప్రభుత్వం కడప జిల్లాలోని 36 మండలాల్లోని వర్షపాత లేమి, పంటల సాగు తగ్గిన ప్రాంతాలను కరువు మండలాల పరిధిలో చేర్చకపోవడం విస్మయాన్ని కలిగించింది. గతేడాది వైసిపి సర్కారు కడప జిల్లాలో నెలకొన్న క్షామ పరిస్థితులను గుర్తించి కరువు మండలాలను గుర్తించడంలో నిరాధరణకు గురిచేసింది. 2024-25 ఖరీఫ్ సీజన్‌లో ఎన్డీయే సర్కారు అన్నమయ్య జిల్లాలో పంటలు సాగు తగ్గిన నాలుగు మండలాలను తగ్గించడం, కడప జిల్లాను పూర్తిగా నిరాదరణకు గురిచేయడం చర్చనీయాంశంగా మారింది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన రైతు సంఘాల నాయకులు కరువు మండలాల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందనే వాదన వినిపిస్తున్నారు. కరువు మండలాల గుర్తింపు నేపథ్యంలో సంబంధిత మండలాల రైతులకు ఎటువంటి ప్రయోజనం ఉంటుందో ఎవరికీ తెలియడం లేదు. సాధారణంగా కరువు పరిస్థితులు నెలకొన్న జిల్లాల్లో రుణాలు రీషెడ్యూల్ చేయడం, ఇన్సూరెన్స్ అమౌంట్ చెల్లింపుల్లో మినహాయింపు ఇవ్వడం, ఇన్సూరెన్స్ విడుదల చేయడం మొదలగు అంశాలను పరిగణలోకి తీసుకోవడం తెలిసిందే. తాజా కరువు మండలాల గుర్తింపు నేపథ్యంలో ప్రభుత్వం బాధిత రైతులకు ఎటువంటి మినహాయింపులు వర్తింపజేయనుందో వేచిచూడాలి.

- ప్రజాశక్తి- కడప ప్రతినిధి

డ్రాగా ముగిసిన అండర్-14 క్రికెట్ మ్యాచ్‌లు

కౌశిక్ (199 పరుగులు)

తర్షిత్ (111 పరుగులు)

జస్టిన్ (101 పరుగులు)

ప్రజాశక్తి - కడప

ఎసిఎ అండర్-14 ఇంటర్ డిస్ట్రిక్ గ్రూప్-బి టోర్నమెంట్‌లో శనివారం కెఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన విజయనగరం, అనంతపురం జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఈ మ్యాచ్‌లో అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 377 పరుగులు చేసింది. రెండవ రోజు మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన విజయనగరం జట్టు ఆట ముగిసే సమయానికి 89.5 ఓవర్లలో 376 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ చెట్టులోని బాబా తర్షిత్ 111, జి. జస్టిన్ 101 పరుగులు, విగ్నేష్ 64 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని రోహిత్ రెండు, లిఖిత రెండు, దేవ స్కంద రెడ్డి రెండు వికెట్లు తీసుకున్నారు. మ్యాచ్ డ్రాగా ముగిసింది. మొదటి ఇన్నింగ్స్‌లో అనంతపురం జట్టు అధికత సాధించింది.

వైఎస్ఆర్ఆర్, ఎసిఎ క్రికెట్ మైదానంలో కృష్ణా, శ్రీకాకుళం జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఈ మ్యాచ్‌లో కృష్ణా జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 115 పరుగులు చేసింది. మూడు వికెట్లు నష్టానికి 102 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో చివరి రోజు బ్యాటింగ్ ప్రారంభించిన శ్రీకాకుళం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 84.3 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 265 పరుగులు చేసింది. ఆ జట్టులోని వివేక్ నంద 108 పరుగులు (నాటౌట్) చేశాడు. కృష్ణ జట్టులోని సాయి ఆశ్రిత్ రెండు వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 2వ ఇన్నింగ్స్ ప్రారంభించిన కృష్ణా జట్టు ఆట ముగిసే సమయానికి 46.0 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 116 పరుగులు చేసింది. మ్యాచ్ డ్రాగా ముగిసింది. మొదటి ఇన్నింగ్స్‌లో శ్రీకాకుళం జట్టు ఆధిక్యత సాధించింది.

కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో నెల్లూరు, గుంటూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఈ మ్యాచ్‌లో నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 164 పరుగులు చేసింది. ఒక వికెట్ నస్తానికి 137 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో చివరి రోజు బ్యాటింగ్ ప్రారంభించిన గుంటూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 90.0 ఓవర్లలో నాలుగు వికెట్లు నష్టానికి 353 పరుగులు చేసింది. ఆ జట్టులోని కౌశిక్ అద్భుతంగా బ్యాటింగ్ ప్రదర్శించి 199 పరుగులు (సెంచరీ) చేశాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు ఆట ముగిసే సమయానికి 40.0 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 127 పరుగులు చేసింది. మ్యాచ్ డ్రాగా ముగిసింది. మొదటి ఇన్నింగ్స్‌లో గుంటూరు జట్టు ఆధిక్యత సాధించింది.

కిచెన్ గార్డెన్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు రమణ

పాఠశాలలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు

- విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని దలవాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం ఉపాధ్యాయుడు రమణ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో విద్యార్థులు సృజన, నో బ్యాగ్ డే సందర్భంగా కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిం చినట్లు తెలిపారు. కిచెన్ గార్డెన్ ఏర్పాటు వల్ల విద్యార్థులకు ఆరోగ్యకరమైన ఆహారం పట్ల అవగాహన పెంచుకొని ఇంటిలో కూడా చిన్న చిన్న మొక్కలు పెంచడం అలవాటు అవుతుందని తెలిపారు. పాఠశాలలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు ద్వారా విద్యార్థి దశ నుంచే ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ విజయ పాల్గొని మొక్కలను నాటారు.

ఉపాధ్యాయులకు ఇంటి స్థలాలు కేటాయించండి

ప్రజాశక్తి-పుల్లంపేట

మండలంలో ఎక్కడైనా అనువైన ప్రభుత్వ స్థలం గుర్తించి ఉపాధ్యాయులకు టీచర్స్ కాలనీ పేరుతో ప్రభుత్వ ధరకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షుడు సయ్యద్ సత్తాజ్ హుస్సేన్, జిల్లా కౌన్సిలర్ బాల నరసింహులు ఆధ్వర్యంలో రైల్వేకోడూరు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి, ఎమ్మెల్యే ఆరవ శ్రీధర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్‌టియు నాయకులు మాట్లాడుతూ గతంలో ప్రభు త్వాలు ఉపాధ్యాయులకు ఇంటి స్థలాలు మంజూరు చేయమని ఈ మధ్యకాలంలో ప్రభుత్వాలు విస్మరించాయని, కూటమి ప్రభుత్వం అయినా దృష్టి పెట్టి ఉపాధ్యాయులకు ఇంటి స్థలాలు మంజూరు చేయవలసిందిగా కోరారు. సొంత గృహం కూడా లేకుండా కొన్ని వేల మంది ఉపాధ్యాయులు బాడుగ ఇళ్లలో నివాసం ఉంటున్నారని తెలిపారు. ఉపాధ్యాయులపై చిన్న చూపు చూడకుండా ఈ సమస్యలపై ప్రత్యేక చొరవ తీసుకుని ఇంటి స్థలాల మంజూరు చేయవలసిందిగా కోరారు. అనం తరం రూపానంద రెడ్డి మాట్లాడుతూ తప్ప కుండా ఉపాధ్యాయులకు ఇంటి స్థలాలు మంజూరు చేయ డానికి కృషి చేస్తానని, అవసరమైతే సిఎం దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానని ఉపాధ్యా యులకు హామీనిచ్చారు. కార్యక్రమంలో ఎస్‌టియు నాయకులు రమణారెడ్డి పాల్గొన్నారు.

ఉమ్మడి కడప జిల్లా షూటింగ్ బాల్ జట్టు ఎంపిక

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల బాలురు గ్రౌండ్‌లో ఆదివారం షూటింగ్ బాల్ సీనియర్ బాలురు జిల్లా జట్టును ఎంపిక చేయనున్నట్లు ఉమ్మడి కడప జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి బి.అనిల్‌కుమార్ తెలిపారు. ఎంపికకు వచ్చేవారు వారి ఆధార్ కార్డు తీసుకురావాలని సూచించారు. మరింత సమాచారం కోసం 9391835714ఈ నెంబర్‌ని సంప్రదించాలని కోరారు.

రాయుడు మృతి కార్మిక ఉద్యమానికి తీరని లోటు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు ఎం.ఎస్.రాయుడు మరణం కమ్యూనిస్టు, కార్మిక ఉద్యమానికి తీరనిలోటని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు తెలిపారు. మండలానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకులు ఎం.ఎస్ రాయుడు శుక్రవారం రాత్రి గుండెపోటుతో ఆకస్మిక మరణం చెందారు. శనివారం రాజంపేట పట్టణంలోని సాయి నగర్ లో ఆయనకు దహన సంస్కారాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుజ్జుల ఈశ్వరయ్య, ఓబులేశు, సిపిఐ, ఎఐటియుసి వ్యవసాయ కార్మిక సంఘం, దళిత కుల పోరాట సమితి, గిరిజన సమాఖ్య, ఏఐటీయూసీ అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం, ఆటో యూనియన్, హమాలి, ఆర్టీసీ, ఎంప్లాయిస్ యూనియన్, సిపిఎం నాయకులు పాల్గొని నివాళులర్పించారు.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

ఆరోగ్య సమస్యలపై తక్షణం స్పందించాలి

ప్రజాశక్తి-పీలేరు

వాతావరణ మార్పుల దృష్ట్యా తలెత్తే ఆరోగ్య సమస్యలపై వైద్య సిబ్బంది తక్షణం స్పందించి ప్రజలు అనారోగ్యానికి గురి కాకుండా నివారణ చర్యలు చేపట్టాలని హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య తెలిపారు. తలుపుల పిహెచ్‌సి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ రమేష్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం సచివాలయాల పరిధిలోని నిర్దేశిత ప్రాంతాల్లో వైద్య సిబ్బంది 'అందరు బాగున్నారా' గృహ సర్వేలో పాల్గొన్నారు. ఉచిత వైద్య శిబిరాలు, వ్యాధుల నిర్ధారణ పరీక్షలు, అధిక రక్తపోటు, మధుమేహవ్యాధి నిర్ధారణ, వ్యాధుల వ్యాప్తికి తీసుకోవాల్సిన నివారణ చర్యలు, ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంట్లో జ్వరాల కేసులను వెతికే కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో తలుపుల పిహెచ్‌సి పరిధిలోని అందరూ క్షేత్ర స్థాయి అధికారులు, ఎఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.

ఉచిత గ్యాస్ సిలిండర్ ఓ నాటకం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఉచిత సిలిండర్లు ఓ పెద్ద నాటకమని, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలను మోసం చేస్తున్నారని వైసిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఉప్పలపాటి యోబు పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఉచిత గ్యాస్ వాగ్దానం ఒక బూటకమన్నారు. రాష్ట్రంలో గ్యాస్ కనెక్షన్ల రూపంలో ప్రస్తుతం తెల్లరేషన్ కార్డులు కలిగి ఆధార్ కార్డుతో అనుసంధానమైన వారు మొత్తం కోటి 48 లక్షలు కాగా, ఉచిత కనెక్షన్లు కోటి ఎనిమిది లక్షల మందికి మంజూరు చేశారన్నారు. సరైందికాదన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కోర్టు రాజంపేట

I.P.NO. 14/2024

తమ్మిడి గుర్రప్ప. ...పిటీషనర్

Vs

1.మల్లెకొండు చెంగల్రాయుడు, తండ్రి చెంగల్రాయుడు, వయస్సు 55 సం॥, రెడ్డిపల్లి గ్రామం మరియు పోస్టు, పుల్లంపేట మండలం, అన్నమయ్య జిల్లా.
2.పెద్దిరాజు రామచంద్ర రాజు, తండ్రి చిన్నయ్య రాజు, వయస్సు 45 సం॥, చిన్నంపల్లి గ్రామం మరియు పోస్టు, ఓబుళవారిపల్లి మండలం, అన్నమయ్య జిల్లా.
3.శ్రావనబోయిన మునిప్రతాప్, తండ్రి సుబ్బారాయుడు, వయస్సు 40 సం॥, గోబ్బురివారి పల్లి గ్రామం, చిన్నంపల్లి పోస్టు, ఓబుళవారిపల్లి మండలం, అన్నమయ్య జిల్లా.
4.నెల్లూరు నాగేశ్వర, తండ్రి నరసింహులు, వయస్సు 45 సం॥, గోబ్బురివారి పల్లి గ్రామం, చిన్నంపల్లి పోస్టు, ఓబుళవారిపల్లి మండలం, అన్నమయ్య జిల్లా.
5.శ్రావనబోయిన తిరుపాలు, తండ్రి సుబ్బారాయుడు, వయస్సు 53 సం॥, గోబ్బురివారి పల్లి గ్రామం, చిన్నంపల్లి పోస్టు, ఓబుళవారిపల్లి మండలం, అన్నమయ్య జిల్లా.
6.A. శంకరయ్య, తండ్రి రామయ్య, వయస్సు 55 సం॥, గోబ్బురివారిపల్లి గ్రామం, చిన్నంపల్లి పోస్టు, ఓబుళవారిపల్లి మండలం, అన్నమయ్య జిల్లా.

...రెస్పాండెంట్లు

పబ్లిక్ నోటీసు

పై కనిన పిటీషనర్, పై కనిన రెస్పాండెంట్లు మీద తనను ఇన్ సాల్వెంట్ గా డిక్లేర్ చేయమని కోరుతూ పై కోర్టులో I.P..NO.14/2024 దాఖలు చేసియున్నారు. ఇందులకుగాను ఎవరికైనా ఎలాంటి ఆక్షేపణలున్న యెడల 19.12.2024 వ తేదీన ఉదయం 10:30 గంటలకు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరై మనవి చేసుకొనవలెనని ఇందు మూలంగా తెలియజేయడమైనది.

//By Order of the Court//

V.కృష్ణ, V.రవిశంకర్

అడ్వకేట్స్, రాజంపేట.

పాస్‌పోర్ట్ పోయినది

వైయస్ఆర్ కడప జిల్లా ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరం డో.నెం 3/98 కాపురస్తులైన కాటాబత్తిన విజయ్‌కుమార్ గారి భార్య కాటాబత్తిన లక్ష్మీదేవి అను నాకు చెందిన ఒరిజినల్ పాస్ పోర్ట్ నెంబర్ **K4165173** పోయినది. ఎవరికైనా దొరికినచో పై చిరునామాకు చేర్చగలరు.

అధ్వానంగా మదనపల్లె-నిమ్మనపల్లె రోడ్డు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

నిమ్మనపల్లె-మదనపల్లె రోడ్డు అధ్వానంగా గుంతలమయం కావడంతో నిమ్మనపల్లె నుంచి మదనపల్లెకు ప్రయాణించాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు మొత్తం గుంతలు ఏర్పడి వాహనదారులు రాకపోకల కొనసాగించటానికి అష్ట కష్టాలు పడుతున్నారు. ప్రభుత్వాలు మాత్రం ప్రజలకు ఇదిగో అదిగో అంటూ కల్లబొల్లి మాటలు చెబుతూ రోడ్డు వేయడానికి కాలయాపన చేస్తున్నడంపై ప్రజలు మండి పడుతున్నారు. మోకాటి లోతు గుంతలు ఏర్పడిన ఈ రోడ్డులో నిత్యం ఆర్‌టిసి బస్సులు, ప్రయివేట్ వాహనాలు, ప్రభుత్వ ఉద్యోగులు, రైతులు తమ వాహనాల్లో ప్రయాణిస్తున్నారు. డ్రైవర్లు గుంతలమైన రోడ్డులో వాహనాలను నడపడానికి ప్రాణ భయం ఏర్పడిందని తెలుపుతున్నారు. కనీసం 108 వాహనంలో అనారోగ్యంతో బాధపడుతున్న వారిని, గర్భిణులను ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించాలన్నా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త వాహనాలు సైతం నెలలు తిరగకుండానే నుజ్జు నుజ్జు అవుతున్నాయని అన్నారు. గత ప్రభుత్వం మదనపల్లె రోడ్డును డబుల్ రోడ్డు చేస్తామని ఐదు సంవత్సరాలు కాలయాపన చేసిందని అన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం తాము మదనపల్లి రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరిస్తామని తెలిపినా, కనీసం గుంతలు కూడా పూడ్చలేక పోతున్నారని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా ప్రజల పడుతున్న ఇబ్బందులను ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం గుర్తించి మదనపల్లె నుంచి నిమ్మనపల్లెకు రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించాలని కోరుతున్నారు.

గుంతలు ఏర్పడిన మదనపల్లె- నిమ్మనపల్లె రోడ్డు

రోడ్డు మరమ్మతు పనులకు శ్రీకారం : ఎమ్మెల్యే

రోడ్డు పనుల మరమ్మతుల వివరాలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

నియోజకవర్గంలోని రహదారులు మహర్దశను సంతరించుకోనున్నాయని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా పేర్కొన్నారు. మండలంలోని నాయనవారిపల్లె గ్రామంలో శనివారం రహ దారి మరమ్మతు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హోల్ ఫ్రీ రహదారులే లక్ష్యంగా రూ.826 కోట్ల నిధులతో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న రహదారుల మరమ్మతు పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టారని అన్నారు. రహదారుల మరమ్మతుతో ప్రమాదాల నివారణకు చెక్ పెట్టడమే కాకుండా వాహనదారులకు ప్రయాణం సుఖమయం అవుతుందని అన్నారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో రాష్ట్రంలో రోడ్లు అధ్వాన స్థితికి చేరుకొన్నాయని అన్నారు. కనీసం మరమ్మతులు కూడా చేపట్టకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటమా డారని విమర్శించారు. కూటమి పాలనలో అభి వృద్ధితోపాటు సంక్షేమం చేపట్టడం జరుగుతోం దన్నారు.కార్యక్రమంలో రోడ్లు భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, డిప్యూటీ ఇంజనీర్, టిడిపి నాయకులు మేస్త్రి మల్లికార్జున, ఆర్ఆర్ వీధి బాబా, మల్లికార్జున నాయుడు, సురేందర్‌రెడ్డి, కూటమినాయకులు, అధికారులు పాల్గొన్నారు. **రైల్వేకోడూరు :** ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రవేశపెట్టిన 'మిషన్ పాట్‌హోల్ ఫ్రీ ఎపి' రోడ్ల గుంతలు పూడ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం వల్ల కోడూరు నియోజ కవర్గ రహదారులు నరకపు ద్వారాలుగా తయారయ్యాయని అన్నారు. అధ్వా నంగా తయారవ్వడమే కాక ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల మరమ్మతులకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని అన్నారు. కొర్లకుంట క్రాస్ నుంచి యల్లాయపల్లి, కృష్ణంపల్లి, ఉప్పరపల్లి రూ.5.5లక్షల వ్యయంతో తారు రోడ్డు గుంతలు పూడ్చే కార్యక్రమంలో ప్రారంభించామని అన్నారు. కొద్ది రోజులలో అన్ని గ్రామాలకు తారు రోడ్లు, సిమెంటు రోడ్లు నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖ అధికారులు, ఎన్‌డిఎ కుటమి నాయకులు కట్టా గుండయ్య నాయుడు, కమతం నాగరాజు, గునిపాటి చెన్నరాయుడు, తాతంశెట్టి నాగేంద్ర, మణి, వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు. **తంబళ్లపల్లి:** కూటమి అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే రోడ్డుకు మరమ్మతులు జరుగుతున్నాయని టిడిపి తంబళ్లపల్లి ఇన్‌ఛార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి అన్నారు. మిషన్ పాంట్ టోల్ ఫ్రీ ఏపీలో భాగంగా కోటకొండ-మట్టం రోడ్లు మరమ్మతు పనులకు ఆయన భూమి పూజ చేశారు. రూ.3.5 లక్షలతో ఈ రోడ్డు బాగు చేస్తున్నట్లు చెప్పారు. సిఎం చంద్రబాబు సహకారంతో తంబళ్లపల్లి రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో కూటమి అధికారులు నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి : ఎంపిడిఒ

గాలివీడు : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ జవహర్‌బాబు

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలో ఉన్న సమస్యలను ఆయా శాఖ అధికారులు పరిష్కారానికి కృషి చేయాలని ఎంపిడిఒ జవహర్‌బాబు తెలిపారు. శనివారం ఎంపిడిఒ సభా భవనంలో జరిగిన ఎంపిపి జల్లా పద్మావతమ్మ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల స్థాయి అధికారులు సమగ్ర నివేదికతో మండల సమావేశానికి హాజరుకావాలని పేర్కొన్నారు. వైఎస్ ఎంపిపి-2 మిట్టపల్లి యదుభూషణ్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీ నుంచి హౌసింగ్‌కు రూ.22వేల చొప్పున రావాల్సి ఉందని ఎపిఒ మండల స్థాధికారులు సమగ్ర ప్రాణాళిక ప్రకారం అర్హులందరికీ ఆ డబ్బులు మంజూరయ్యేలా చూడాలని పేర్కొన్నారు. ఎంఇఒ శ్రీనివాసులు మాట్లాడుతూ నాడు-నేడు కింద పనులు ఆగిపోయాయని ఖాతాలో నిధులు ఉన్నా కానీ సిమెంటు లేక పనులు నిలిచిపోయినట్టు ఆయన పేర్కొన్నారు. వెటర్నరి అసిస్టెంట్ టి. భాస్కర్ మాట్లాడుతూ తూముకుంటలో ఇటీవల పిడుగుపాటుతో 18 పొట్టేలు మృతి చెందాయని విపత్తు నిర్వహణ కింద వారికి పరిహారం కలెక్టర్‌కు పూర్తి నివేదిక పంపినట్లు తెలిపారు. ఎఒ మురళీధర్ మాట్లాడుతూ గాలివీడు మండలాన్ని కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకరించిందని పంట నష్టపోయిన పంట సాగు చేసిన ప్రతి ఒక్క రైతుకు ప్రభుత్వం పరిహారం అందిస్తుందని తెలిపారు. పేర్కొన్నారు. కదిరి-రాయచోటి మార్గంలో బస్సులు సమయపాలన పాటించడం లేదని మండల ప్రత్యేక అధికారి వెంకట్రాంరెడ్డి పేర్కొన్నారు. మండల సమావేశానికి గైర్హాజరైన ఆర్‌టిసి అధికారులు నోటీసులు అందించాలని అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి-2 శ్రీనివాసులు ఎంపిటిసిలు చంద్రారెడ్డి, చిన్నపరెడ్డి, సర్పంచ్‌లు మిట్టపల్లి లక్ష్మీదేవి దాదినేని దీప్తి కేశవరెడ్డి , శివశంకర్ నాయుడు, కో-ఆప్షన్ మెంబర్, మండలస్థాయి అధికారులు, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ , పంచాయతీరాజ్ ఎఇ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోండి : వైస్ ఎంపిపి

ప్రజాశక్తి-రామాపురం : కరువులో రైతులను ఆదుకోవాలని మండల ఉపాధ్యక్షుడు రవి శంకర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిషత్ సభ భవనంలో మండల సర్వసభ్య సమావేశం ఉపాధ్యక్షులు రవిశంకర్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది నుంచి మండలంలో వర్షాలు లేక వేరుశనగ, వరి ఇతర ప్రధాన వాణిజ్య పంటలు రైతులు సాగు చేయలేక పోయారని అన్నారు. సగటు వర్షపాతం లేకపోవడంతో ప్రధాన వాణిజ్య పంటలు రైతులు సాగు చేసుకోలేక పోయారన్నారు. మండలంలో 13 గ్రామపంచాయతీలో ఖరీఫ్ సీజన్‌లో వరి, వేరుశనగ పంటలు సాగు చేయలేక ఉలవ పంట ప్రత్యామ్నాయంగా సాగు చేసుకున్నారని అన్నారు. ప్రభుత్వం రాయచోటి నియోజకవర్గం లోని అన్ని మండలాలను కరువు మండలంగా ప్రకటించడం హర్షణీయమని అన్నారు. కరువు మండలంలో అందరికీ ఉపాధి పనులు ముమ్మరంగా కల్పించి రైతులను, కూలీలను ప్రభు త్వమే ఆదుకోవాలని అన్నారు. పంట నష్టం పంటల బీమా రైతులకు అందించి ఆదుకోవాలని కోరారు ఆయా శాఖల అధికారులు సమావేశంలో శాఖల పనితీరుపై సభ్యులకి వివరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జాషువా, సర్పంచ్‌లు నాగభూషణరెడ్డి, సరోజమ్మ, ఆంజనేయులు, మునీరు, వెంకటరెడ్డి, రామాంజనేయులు, ఎంపిటిసిలు మౌలా, తులసిపాల్గొన్నారు.

గ్రామ సమస్యలపై దృష్టి సారించాలి :'నల్లారి'

ప్రజాశక్తి-కలకడ

గ్రామ సమస్యలపై ప్రతి అధికారి దృష్టి సారించాలని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి అధికారులకు సూచించారు. శనివారం మండల కేంద్రమైన కలకడ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన అధికారులు, ప్రజాప్రతినిధుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భం గానాయన మా ట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. అధికారులు ప్రజలతో మమే కమై వారి సమస్యలను తెలుసుకొని పరిష్క రించేందుకు కృషి చేయాలని చెప్పారు. మండ లంలో నీటి సమస్య ఉన్న చోట్ల బోరు వేసి సమ స్యను పరిష్కరించేందుకు ఆర్డబ్ల్యుఎస్ అధికారి ఇరగన్న పనిచే యాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విధి దీపాలు ఏర్పాటు చేసి ప్రతి గ్రామంలో వెలుగు నింపాలని సూచించారు. గుడిబండ పంచా యతీపై అధికా రులు, సచివాలయం సిబ్బంది ఎక్కువ దృష్టి సారించాలని అన్నారు. ఎన్‌ఆర్‌ఇ జిఎస్ ద్వారా పనులను కూలీల కల్పించి వారిని ఆదుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందని చెప్పారు. విద్యుత్ సమస్యలను చోటా అధి కారులు స్పందించి విద్యుత్ సమస్య లేకుండా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. ఏప గ్రామాలలో సిసి రోడ్లు లేవో వాటిని గుర్తించి సిసి రోడ్లు వేయడానికి నివేదిక అందించాలన్నారు. గతంలో వైసిపి ప్రభుత్వం డబ్బులు దోచు కోవడం దాచు కోవడమే పనిగా పెట్టు కున్నారని విమర్శించారు. గత ప్రభుత్వం చేసిన దోపిడీల వల్ల ప్రస్తుత ప్రభుత్వం కోలుకోలేక పోయిందని చెప్పారు. నియో జకవర్గంలో అన్ని మండలాలు కరువు మండలాలుగా ప్రకటిం చారని, కెవిపల్లి మండ లాన్ని కరువు మండలంగా ప్రకటించ కపోవడం బాధాకర మన్నారు.కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాల వారికి న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ప్రభాకర్ నాయుడు, సూర్య ప్రకాష్ నాయుడు, రవిప్రకాష్ నాయుడు, మద్దిపట్ల వెంకట రమనా యుడు, కాంతారావు, బివిస్వామి, తిరుపతినాయుడు, మాజీ ఎంపిటిసి శ్రీనివాసనాయుడు, మాజీ ఎంపిపి వంగిమల మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్ విశ్వనాథ నాయుడు, తహశీల్దార్ ఫణికుమార్, ఎంపిడిఒ అబ్దుల్ రహీం, ఎపిఒ చెన్నకేశవులు, ఎస్ఐ రామాంజనే యులు, పంచాయతీ కార్యద ర్శులు, సచివాలయ సిబ్బంది, విఆర్ఒలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి

కృష్ణా జలాలతో సాగునీరు

ప్రజాశక్తి - లింగాల

కరువు నేలను సస్యశ్యామలం చేసేందుకు లింగాల కూడి కాల్వ ద్వారా కృష్ణా జాలలను వినియోగిస్తున్నట్లు పులివెందుల టిడిపి బాధ్యుడు బిటెక్ రవి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని కూడి కాల్వ ద్వారా ఎత్తిపోతల పథకం నుంచి లింగాల చెరువుకు నీటిని అందించే మోటర్లును శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం బిటెక్ రవి మాట్లాడుతూ లింగాల కూడి కాల్వ ద్వారా మండల పరిధిలోని అన్ని చెరువులు నింపేందుకు చర్యలు చేపట్టామన్నారు. సాగునీటి సమస్య ఉన్న గ్రామాలకు కూడా సరఫరా చేసేందుకు చర్యలు చేపడుతున్నామరు. కరువును పారదోలే విధంగా ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందన్నారు. అక్కడికి వచ్చిన రైతుల సమస్యలను ఆయన తెలుసుకున్నారు అనంతరం మండల కేంద్రంలోని ఇండియన్ గ్యాస్ గోడౌన్‌ను సందర్శించారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సరఫరా చేయాలని గ్యాస్ డీలర్ రాంబాబుకు సూచించారు. కార్యక్రమంలో టిడిపి మండల బాధ్యులు సంజీవరెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, పార్నపల్లె ధనుంజయ నాయుడు, మహే శ్వరరెడ్డి, మండల నాయకులు, డిఇఇ చైతన్యరెడ్డి, ఎఇప్రదీప్‌రెడ్డి , రైతులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ డిఇఒ శివప్రకాష్‌రెడ్డి

పాఠశాలల్లో డిప్యూటీ డిఇఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలంలోని పలు పాఠశాలలను డిప్యూటీ డిఇఒ శివప్రకాష్‌రెడ్డి అకస్మికంగా తనిఖీ చేశారు. ఎంఇఒ కార్యాలయం, కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాల, మాధురి పాఠశాలను, దారుల్ హుదా పాఠశాలలను పరిశీలించారు. అపార్ నమోదు, మార్కులు నమోదు చేయడంలో ఉపాధ్యాయ సిబ్బందికి సలహాలు అందించారు. క్షుద్ర పూజలు అని సోషల్ మీడియాలో వచ్చిన వార్తకు స్పందిస్తూ ఎస్ఐ ఎం.శ్రీనివాసులుపాఠశాలను సందర్శించి మూఢ నమ్మకాలపై అవగాహన కల్పించి విద్యార్థుల్లో మనోధైర్యం నింపారు. బాలికలకు గుడ్‌టచ్, బ్యాడ్ టచ్ పలు అంశాల పైన సూచనలు, సలహాలు అందించారు. డిప్యూటి డిఇఒ వెంట ఎంఇఒ-2 సీఎం రవీంద్ర నాయక్, ఎం ఐఎస్ కో-ఆర్డి నేటర్ ముబారక్, స్పెషల్ ఆఫీసర్ శివశృతి, సిఆర్‌పిలు గంగయ్య, కదిరున్ పాల్గొన్నారు.

మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు

ప్రజలకు మెరుగైన సేవలందించాలి : మంత్రి

ప్రజాశక్తి-గాలివీడు

సచివాలయ ఉద్యోగులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని గరుగుపల్లెలో కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ప్రజలను పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా వారికి అవసరమైన సేవలను సకాలంలో అందించాలన్నారు. ప్రజాప్రతినిధులు వివిధ సమస్యలపై సచివాలయాలకు వచ్చినప్పుడు వెంటనే వారి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. చుక్కల భూముల సమస్యల పరిష్కారానికి త్వరలో చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. సచివాలయ ఉద్యోగులకు ఎటువంటి సమస్యలున్న తమ దృష్టికి తీసుకవచ్చి పరిష్కరించుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇచ్చేది గోరంత.. లాక్కునేది కొండంత

- పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

ఇచ్చేది గోరంత.. లాక్కునేది కొండంత అనే సామెతలా ఉంది కూటమి ప్రభుత్వ వాలకమని పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి విమర్శించారు. స్థానికంగా శనివార ఆయన విలేకరులతో మాట్లాడుతూ మట్టి ముంత ఇచ్చి వెండి చెంబు దొంగిలించినట్లుంది టిడిపి కూటమి పాలన అని ఎద్దేవా చేశారు. ఉచిత గ్యాస్ పథకం పేరుతో ప్రభుత్వం ఏడాదికి ప్రజలకు ఇస్తున్నది రూ.2,684 కోట్లు కాగా.. కరెంటు సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రజల నుండి లాక్కుంటున్నది రూ.6,073 కోట్లు అన్నారు. ఇదికాక మరో సారి సర్దుబాటు ఛార్జీల పేరుతో రూ.11826 కోట్లు అదనపు భారం మోపబోతున్నట్లు చెప్పారు. మ్యానిఫెస్టోలో చెప్పిన ప్రకారం ఉచిత గ్యాస్ పథకం అమలు కావడం లేదన్నారు. ప్రతి ఇంటికీ ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు సరఫరా చేస్తామని చెప్పారన్నారు. రాష్ట్రంలో 180 లక్షల కుటుంబాలు ఉండగా, అందులో 154 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉన్నట్లు తెలిపారు. 154 లక్షల గ్యాస్ కనెక్షలకు ఉచిత గ్యాస్ ఇవ్వాలంటే ఏడాదికి రూ.4000 కోట్లు కావాలన్నారు. కానీ ప్రభుత్వం రూ.2,684 కోట్లు మాత్రమే ఇస్తోందన్నారు. దీన్ని బట్టి ఉచిత గ్యాస్ పథకం కోటి కనెక్షన్లకు మాత్రమే వర్తిస్తుందన్నారు. 54 లక్షల కనెక్షన్లకు వర్తించడం లేదని స్పష్టంగా తెలుస్తోందని ఆయన వివరించారు.పెంచిన విద్యుత్ ఛార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

క్రైం కార్నర్

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరిపై దాడులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వేర్వేరు ప్రాంతాల్లో శనివారం ఇద్దరిపై దాడులు జరిగాయి. బాధితుల కథనం మేరకు.. కురబలకోట మండలం రామిగానిపల్లెకు చెందిన రామ్మూర్తికి మతిస్థిమితం సరిగా లేదు. వీధిలో కనిపించిన వారిని దూషిస్తున్నాడని అదే గ్రామానికి చెందిన కొందరు యువకులు రామ్మూర్తిని ఊరి చివరికి లాక్కెల్లి విచక్షణా రహితంగా దాడి చేసి కొట్టి తీవ్రంగా గాయపరిచారు. బాధితుడిని కుటుంబీకులు మదనపల్లె జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు కేసు నమోదు చేశారు. పుంగనూరు ధోబి కాలనీకి చెందిన శ్రీనివాసులు కుమారుడు శివ పెయింటర్. స్థానికంగా ఉన్న కొందరి యువకులతో పాత కక్షలు ఉన్నాయి. ఈ క్రమంలో కొందరు యువకులు మాట్లాడే పని ఉందని పిలిచారు. పుంగునూరు సమీపంలోని మేలుపట్ల లోని ఓ నిర్మానుష్య ప్రదేశంలోకి తీసుకెళ్లి బీరు బాటిళ్లతో మూకుమ్మడిగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. స్థానికులు గమనించి బాధితుడిని 108లో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు పుంగనూరు పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని భార్యాభర్తలకు గాయాలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

ట్రాక్టర్ ఢీకొని భార్యాభర్తలు తీవ్రంగా గాయపడిన సంఘటన నిమ్మనపల్లి మండలంలో జరిగింది. సదుం మండలం గొడ్లవారిపల్లెకు చెందిన భాస్కర్ కుమారుడు సి.హరీష్ తన భార్య రేవతి తో కలిసి పలమనేరు మండలం పత్తికొండలో నివాసం ఉంటున్నాడు. శనివారం భార్యాభర్తలు ఇద్దరూ కలిసి ద్విచక్రవాహనంలో రేవతి పుట్టినిల్లు వాల్మీకిపురం మండలం చింతపర్తికి బయలుదేరారు. పుంగనూరు, బోయకొండ, నిమ్మనపల్లి మీదుగా చింతపర్తికి వెళుతుండగా మార్గమధ్యలోని చెరువుముందరపల్లె (నల్లగొండ) సమీపంలోని మలుపులో ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను అకస్మాత్తుగా డ్రైవర్ ట్రాక్టర్‌ను వెనుకకు తిప్పడంతో వెనుకనే వస్తున్న ద్విచక్రవాహనం ను ఢీకొంది. ప్రమాదంలో రేవతి తీవ్రంగా గాయపడగా, హరీష్ స్వల్పంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నిమ్మనపల్లె పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి

- మృతులు ఇసుకపల్లెకు చెందినవారు

ప్రజాశక్తి - సిద్ధవటం

మండల పరిధిలో కడప-చెన్నై జాతీయ రహదారి జెఎంజె కాలేజి సమీపంలో కోతుల తూము వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. ఒకరు అక్కడికక్కడే చనిపోగా, మరో వ్యక్తి గాయపడి చికిత్స పొందుతూ రిమ్స్‌లో మృతి చెందాడు. వివరాల్లోకెళితే.. తిరుపతి నుండి పులివెందుల డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు కడపకు వస్తుండగా, కడప నుండి రాజంపేటకు ద్విచక్ర వాహనంలో వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ఇసుకపల్లి గ్రామానికి చెందిన ప్రవీణ్(19) అక్కడికక్కడే మృతి చెందాడు. రోహిత్ కుమార్ (20) బలమైన గాయాలు తగలడంతో 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.